# ప్రజ, ఉద్యోగి, మంత్రి

మంత్రిగారు మంత్రిత్వాన్ని స్వీకరించిన కొత్తలో...

ఒకసారి ఒకచోటికి దౌరా వెళ్ళారు. వెంట ఉద్యోగికూడా వెళ్లాడు.

అక్కడి ప్రజలంతా కలిసి మంత్రిగారి గౌరవార్థం ఒక గొప్ప సభచేసి మంత్రిగారికి సన్మాన పత్రం సమర్పించుకున్నారు.

మంత్రిగారు బ్రహ్మానందభరితులై కరతాళధ్వనులమధ్య లేచి ఇలా శెలవిచ్చారు:

"ప్రజా సోదరులారా! నేటికిగాని మనం సంపూర్ణ స్వతంత్రులం కాలేదు. నేటికిగాని మన రాజ్యం మనకు లభించలేదు. మీలో, అంటే ప్రజల్లో ఒకణ్ణయిన నేను ఈనాడు మంత్రినయినానంటే మీ రాజ్యం, అంటె మనరాజ్యం స్థాపించబడిందనటానికి ఇంతకంటే ఏం నిదర్శనం

కావాలి? ఇంక ఈరాజ్యమంతా మీదే. అంటే మనదే. మనఇష్టప్రకారమే రాజ్యం నడపగలదు. ఇన్నాళ్ళూ ఈ రాజ్యాన్ని పరిపాలించిన వాళ్ళు-ఇదిగో ఇక్కడ కూచున్నాడే ఈ ఉద్యోగి, ఇతని సోదరులు. వీళ్ళ సంగతి మీకు అంటే మనకు తెలియనిదికాదు. వీళ్ళంతా వొట్టి దుర్మార్గులు, లంచగొండులు ప్రజల్ని పీడించి, బాధించి, అధికారం చలాయించడం తప్ప వీళ్ళకింకేం చేతకాదు. ఇన్నాళ్ళూ మీరు వీళ్ళకి భయపడి వీళ్ళ చెప్పుచేతల్లో వుంటూ వచ్చారు. ఇకమీదట ఈ పరిస్థితులన్నీ తారుమారై పోవాలి. మీరు వీళ్ళకి భయపడవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు. వీళ్ళని మీరింక మీ సేవకులుగా భావించుకోవాలి మీ యడల భయభక్తులు చూపుతూ మెలుగవలసిన బాధ్యత వీళ్ళమీద వుంది. మీరు వీళ్ళని శాసించవచ్చు. మీ ఆజ్ఞల్ని పాటించకపోతే దండించనూ వచ్చు. ఇది "ప్రజారాజ్యం!"

ప్రజలు సంతోషం పట్టలేకపోయారు. సభలో చప్పట్లు, ఈలలు, కేకలు బయలుదేరాయి.

"స్వతంత్రానికీ జై!" "ప్రజారాజ్యానికీ జై!" "ప్రజామంత్రికీ జై!" అనే నినాదాలు మిన్నంటాయి.

మంత్రిగారు ముసిముసి నవ్వుల్తో సుఖాసీనులయ్యారు.

ఉద్యోగి బిక్క మొహం వేసి, తలవంచుకుని కూచున్నాడు.

దౌరానించి తిరిగివచ్చాక మంత్రిగారితో ఉద్యోగి ఇలా మనవి చేసుకున్నాడు:

"మీరు శెలవిచ్చిందంతా సబబుగానే వుంది. కాని ఇది ఎలెక్షను ఉపన్యాసాలకు పనికొస్తుందేమోగాని పరిపాలనకు సరిపడదేమో..."

"అంటే?," అన్నారు మంత్రిగారు.

"ప్రభుత్వమంటే ప్రజలకు కాస్త భయభక్తులుండాలి?"

"ఛ! ఛ! నీదంతా పాతబోకు. నువ్వొట్టి ఛాందసుడివి. ప్రపంచం మారిన సంగతే నువ్వింకా గుర్తించలేకుండా వున్నావు. ప్రజల్ని భయ పెట్టటమేమిటి, వాళ్ళని ప్రేమతో చూడాలిగాని. అయినా నువ్వు వాళ్ళని పరిపాలించాలని ఎవరన్నారు. వాళ్ళదే రాజ్యం. వాళ్ళే పరిపాలించుకుం టారు. నువ్వు వాళ్ళ జీతగాడివి. వాళ్ళ సేవచేయాలి అంతే" అని గదమాయించారు మంత్రిగారు.

మారుమాట్లాడలేకపోయాడు ఉద్యోగి.

కొన్నాళ్ళకి కొన్ని ప్రాంతాలలో కరువొచ్చింది.

చెరువులూ, బావులూ ఎండిపోయాయి. పచ్చిక బయళ్ళు బీటువారి పోయాయి. నీటికీ, తిండికీ కరువై ప్రజలు ఆకలి దప్పుల్తో మలమల మాడుతూన్నారు. పశువులు ప్రాణాలు వదులుతూన్నాయి.

ప్రజలు గగ్గోలుపడుతూ ఉద్యోగి దగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

"ఏమయ్యా! ఉద్యోగీ! నువ్విక్కడ హాయిగా సుఖంగా కాలుమీద కాలువేసుకుని కూచున్నావు. మా గతి చూసేదెవరు?" అని అడిగారు.

"చూడండీ నేను మానవమాత్రుణ్ణి. ఈ కరువు రావటానికి మానవ మాత్రులు ఎంతమాత్రం బాధ్యులుకారు. మూడు సంవత్సరాలు వరసగా వర్షాలు కురువక కరువొచ్చింది. అది మన దురదృష్టమే అనుకోవాలిగాని నాకు తెలిసినంతమట్టుకు రాని వర్షాల్ని రప్పించే తాహత్తు మనలో కలగ లేదు. అయితే వర్షాలు మూడు నాలుగు సంవత్సరాలు రాకపోయినా కరువు రాకండా చేయటానికి వీలుంది. ఆయా ప్రాంతాల్లో పెద్ద పెద్ద సరస్సులు నిర్మించాలి. ఒకటి రెండు నిర్మిస్తూనే వున్నారుకాని ఇంకాచాలా కట్టించాలి. కాని వాటికి ప్రస్తుతం డబ్బులేదు."

"నువ్వెప్పటి సంగతో చెబుతావు. ఇప్పటి కరువుమాటేవిటని మేమడుగుతోంటే," అని విసుక్కున్నారు ప్రజలు.

"అల్లా నిలదీసి అడిగితే నేనేం చెప్పను! నేను చెయ్యగలిగిందంతా చేస్తూనే వున్నాను. వున్న బావుల్ని ఇంకా లోతుకు తవ్వించటం, ఇంకా కొత్త బావులు తవ్వించటం, ఇతర ప్రాంతాల్లోంచి దొరికినంత ధాన్యం సేకరించి మీకు సప్లయి చేయించటమూ నా శక్తి కొలదీ చేస్తూనే వున్నాను. ఇంతకంటే నన్నేం చెయ్యమన్నారు."

"ఛ ఛ వీడితో లాభంలేదు. మంత్రిగారన్నట్టు వీడికి అధికారం చలాయించటం తప్ప మరేం చాతకాదు" అనుకుని ప్రజలంతా వెళ్ళి మంత్రి గారితో మొరపెట్టుకున్నారు.

"నేనన్లేదూ? వాడంతే. వొట్టి అప్రయోజకుడు. కాలానికి తాళం వెయ్యటం వాడింకా నేర్చుకోలేదు. అయినా చూస్తాగా వాడు ఎల్లా మారడో. అన్నీ వాడిచేతే చేయిస్తాను. మీరు విశ్చింతగా వెళ్ళండి— ఆఁ మీరు వొహపని చెయ్యాలి. మీమీ గ్రామాల్లో యజ్ఞాలు చెయ్యండి... దానికయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుంది. తెలిసిందా? వెళ్ళండి ఇంకా వర్షాలు ఎల్లా కురవ్వో చూస్తాను?" అంటూ హామీ ఇచ్చారు మంత్రిగారు.

ప్రజలు సంతోషంతో చంకలు కొట్టుకుంటూ వెళ్ళారు.

వెంటనే మంత్రిగారు ఉద్యోగికి ఉత్తర్వులు జారీచేశారు. "ఇది ప్రజారాజ్యం. కాబట్టి ప్రజలు కరువుతో చావటానికి వీల్లేదు. వాళ్ళు చావకుండా వుండే బాధ్యత నీది. సాకులేమీ వినదలచుకోలేదు."

ఉద్యోగి గుండె గుభేలుమంది. సర్వశక్తులా ప్రయత్నం చేస్తోనే వున్నాడు. కాని తాను అనుకున్నట్లే అట్టే లాభం లేకపోతోంది. బావులకూ ధాన్యానికంటే యజ్ఞాలకెక్కువ ఖర్చవుతోంది. చేసేదిలేక అటు ప్రజకూ, ఇటు ప్రజామంత్రికీ తలఒగ్గి మౌనంగా వున్నాడు.

ఇంతలోకి వర్షాలు వచ్చాయి. కుంభ వర్షాలు వచ్చాయి. సంవత్సరం ఆసాంతం కురవవలసినంత వర్షం రెండు రోజుల్లో కురిసింది.

పూరిళ్ళు, పెంకుటిళ్ళు ధ్వంసమయ్యాయి. వరదలొచ్చి కొన్ని పంటలూ, గుడిసెలూ నాశనమయ్యాయి. చెరువు కట్టలూ, రోడ్లూ తెగి పోయాయి. కొందరు మనుషులకూ, అనేక పశువులకూ ప్రాణాపాయం కలిగింది.

ప్రజలంతా మళ్ళీ గగ్గోలుపడుతూ ఉద్యోగి దగ్గరికెళ్లారు. "ఏమయ్యా! నువ్విక్కడ హాయిగా బంగళాలో కుచున్నావు. మాగతేం కాను?" అని అడిగారు.

"నేనేం చేసేది? ఈ అకాల వర్షాలకి నేనా బాధ్యుణ్ణి? యాభై అరవై సంవత్సరాలకు ఒకమాటు బ్రహ్మాండమైన వర్షాలు ఈ ఏడు వచ్చాయి. అవేమీ ముందే చెప్పిరావు. ఒకటి రెండు రోజులు ముందు తెలిసినా చెరువుకట్లల్నీ, రోడ్లనీ, పశువుల్నీ కాపాడటానికి నేనేం చెయ్య గలను? అయినా ఇప్పుడు మీరేమీ బాధపడకుండా చేసే ప్రయత్నాలు నేను చేస్తూనే వున్నాను," అని సవినయంగా చెప్పుకున్నాడు.

"ఉహుం! వీడు ఎప్పుడూ ఇంతే," అనుకుని ప్రజలు మంత్రిగారి దగ్గరికి వెళ్ళి మొరపెట్లుకున్నారు.

మంత్రిగారికి మండుకొచ్చింది. ఉద్యోగిని పిలిచి బాగా చివాట్లు వేశాడు. దీనికంతా బాధ్యత అతనిదేనన్నాడు. అతనిచ్చే సంజాయిషీ ఏదీ విననన్నాడు. వెంటనే చెరువులూ, రోడ్లూ మరమ్మతు చేయించి, ఇళ్ళు కట్టించి ధాన్యం సప్లయి చేయించాలన్నాడు. అంతా వారం పది రోజుల్లో అయిపోవాలన్నాడు.

"అన్నీ చేయించగలనుగాని చెరువుల విషయంలో మీరు కాస్త ఆలోచించాలి. ఎన్నో వందల చెరువులు తెగాయట. అవన్నీ చేయించటం

పీలుపడదు. మరో వారంలో మామూలు వర్షాలు రావొచ్చు. వీలై నంత మట్టుకు చేస్తాను," అన్నాడు ఉద్యోగి.

"ఉహూఁ అల్లా వీల్లేదు. ఒక్క చెరువుగూడా మరమ్మతుకాకుండా వుంటానికి వీల్లేదు. నీ సాకులేవీ వినను," అంటూ వెళ్ళిపోయారు మంత్రిగారు.

హడలెత్తిపోయాడు ఉద్యోగి. ఎల్లా, ఎల్లాచేయటం ఈ అలా వుద్దీన్ పని! ఈ పత్రికలు తిరిగేసేసరికి మరీ పిచ్చెక్కినట్టయింది. పత్రికల వాళ్ళు తననే తిడుతూన్నారు. ఎటూ పాలుపోలా. తీవ్రంగా ఆలోచించటం మొదలెట్టాడు.

చప్పున బహుచక్కని వూహ స్ఫురించింది. వెంటనే ఒక కాగితం తీసికుని ఇలా రాశాడు :

"అయ్యా! మంత్రిగారూ! మీరన్నట్లుగానే నేను వొట్టి పాపాత్ముణ్ణి. ఇన్నాళ్ళు కూపస్థమండూకంలా ఈ వుద్యోగంలోనే పడిచస్తున్నాను. కాలం ఎన్ని మార్పులు తెచ్చిందో. మనుషులకు ఎన్ని అవకాశాలు కల్పించిందో నేనింతవరకూ తెలిసికోలేకపోయాను. ఇది ప్రజాయుగం, ప్రజారాజ్యం. నేనింకెన్నాళ్ళు ఇట్లా ప్రజలకు దూరంగా వుండి పాపిష్టి జీవితం గడపను? ప్రజల్లో అంటే మీలో ఐక్యం కావటానికి నా హృదయం తహతహలాడుతోంది. ఉద్యోగమనే ఈ పాపిష్టి కవచం వదిలేస్తున్నాను. వెంటనే నా రాజీనామాను స్వీకరించి నన్ను తరింపజేయ ప్రార్థన. ప్రజారాజ్యానికీ జై!"

ఉద్యోగ దాస్య బంధనాల్నించి విముక్తి పొంది ప్రజల్లో కలిసి హాయిగా నిద్రపోయాడు ఉద్యోగి.